సాక్షి
తూర్పుగోదావరి
శనివారం । 7 । అక్టోబర్ । 2023



అన్నదానానికి విరాళం


అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి పెదపెంకి హిమకర్ దంపతులు (విశాఖపట్నం) రూ.2,15,000 విరాళాన్ని శుక్రవారం సమర్పించారు.



నిత్యాన్నదాన పథకానికి విరాళం

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలంయలో నిత్యాన్నదాన పథకానికి మంతెన కళ్యాణ చక్రవర్తి శుక్రవారం రూ.1,00,008లు విరాళం అందజేశారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం:కాటన్ బ్యారేజ్ నుంచి శుక్రవారం తూర్పు డెల్టాకు 4400, మధ్య డెల్టాకు 2500, పశ్చిమ డెల్టాకు 6000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భద్రాచలం వద్ద 19అడుగులకు నీటి మట్టం చేరింది.

న్యూస్‌రీల్

నేడు సురక్ష వైద్య శిబిరాలు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ మాధవీలత తెలిపారు. పోలమూరు 2 (అనపర్తి మండలం), వందలపాక (బిక్కవోలు), లక్ష్మీపురం (దేవరపల్లి), తంటికొండ (గోకవరం), ఎంఆర్‌పాలెం 2 (కడియం), కోటి (కోరుకొండ), వేములూరు (కొవ్వూరు), జగన్నాథపురం (నల్లజర్ల), మునిపల్లి (నిడదవోలు), ఏవీ అప్పారావు వాంబే కాలనీ (రాజమహేంద్రవరం అర్బన్), వెలుగుబంద (రాజానగరం), వడిశలేరు1 (రంగంపేట), రఘుదేవపురం 2 (సీతానగరం), వేగేశ్వరపురం 1 (తాళ్లపూడి), మోర్త 1 (ఉండ్రాజవరం) సచివాలయాల్లో శిబిరాలు జరుగుతాయన్నారు.

జిల్లాలో 2,500 ఎకరాల్లో సెరికల్చర్



కామరాజు

కోటనందూరు: సెరికల్చర్ సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని పట్టు పరిశ్రమ శాఖ డిప్యూటీ డైరెక్టర్, కోటనందూరు మండల ప్రత్యేకాధికారి కామరాజు అన్నారు. కోటనందూరులో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2,500 ఎకరాల్లో పట్టు పురుగుల సాగు జరుగుతోందన్నారు. చిత్తూరు, సత్యసాయి జిల్లాల తరువాత కాకినాడ జిల్లాలో అత్యధికంగా సెరికల్చర్ సాగు చేస్తున్నట్టు తెలిపారు. ఇతర పంటల కన్నా అధిక లాభాలిచ్చే ఈ సాగుకు ప్రభుత్వం పలు రాయితీలు అందిస్తోందన్నారు. ఎకరం విస్తీర్ణంలో సెరికల్చర్ సాగుకు రూ.25 వేలు ఖర్చు అవుతుంటుండగా ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం రాయితీ, బీసీ, ఓసీలకు 70 శాతం రాయితీని ప్రభుత్వం ఇస్తోందన్నారు. రైతులు సెరికల్చర్ సాగుపై రైతులు దృష్టి సారించాలని సూచించారు.

అన్నదాన పథకానికి రూ. 10 లక్షల విరాళం

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): కాకినాడ అశోక్‌నగర్‌లో ఉన్న షిరిడి సాయి పూజా మందిర్ ట్రస్ట్ అన్నదాన పథకానికి నగరానికి చెందిన విశ్రాంత బ్యాంకు ఉద్యోగి చెరుకూరి శివసుందర భాస్కరం, వెంకట సత్యవాణి దంపతులు శుక్రవారం రూ.10 లక్షలు విరాళం అందించారు. ట్రస్ట్ చైర్మన్ వేదుల అచ్యుతరామారావు దాతలను సత్కరించి, వారికి బాబా చిత్రపటాలను అందించారు. పండితులు వారికి వేద ఆశ్వీర్వచనం అందించారు. ట్రస్ట్ సభ్యులు నాగ పద్మ, మధునాపంతుల జగదీశ్వరి పాల్గొన్నారు.

19న వికాసలో జాబ్‌మేళా

కాకినాడ సిటీ: తమ కార్యాలయంలో ఈనెల 19న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె లచ్చారావు తెలిపారు. అపర్ణ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ ట్రైనీ ల్యాబ్ టెక్నిషియన్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ ప్రొడక్షన్, నిట్ ఐసీఐసీఐ బ్యాంక్ రిలేషన్ షిప్ మేనేజర్, సోలారా యాక్టివ్ ఫార్మాసైన్సెస్లో ప్రొడక్షన్ టెక్నీషియన్ ఉద్యోగాలకు, డీడీయూజీకేవై స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారని వివరించారు. ఎస్ఎస్‌సి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డిగ్రీ బిటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్ల లోపు వయస్సు కలిగిన అభ్యర్థులు అర్హులన్నారు. నెలకు రూ.12 వేల నుంచి రూ.25 వేల వరకు జీతం, ఇన్సెంటీవ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులందరూ 19న సోమవారం కలెక్టరేట్లోని వికాస కార్యాలయంలో ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్స్ జెరాక్స్‌లతో హాజరుకావాలని పీడీ వివరించారు.

కడుపు కోతకు చెక్..!



- సిజేరియన్లు తగ్గించేందుకు వైద్య శాఖ ప్రణాళిక
- 'సీ–సేఫ్' పేరుతో సహజ ప్రసవాలు పెంపొందించేందుకు చర్యలు
- ఆ దిశగా మహిళల్లో చైతన్యం నింపేందుకు అవగాహన సదస్సులు
- ఇప్పటికే వైద్యులు, సిబ్బందికి పూర్తయిన శిక్షణ
- 80 శాతం సిజేరియన్లు ప్రైవేటులోనే...

సాక్షి, రాజమహేంద్రవరం: బిడ్డకు జన్మనివ్వడం పునర్జన్మతో సమానం. అదీ సహజ పద్ధతిలో జరిగితే తల్లీ, బిడ్డ అత్యంత సురక్షితం. పుట్టే బిడ్డకూ ఎలాంటి ఆపద ఉండదు. కానీ క్షేత్ర స్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యాల ధనదాహం అమ్మ కడుపును కోసేస్తోంది.. సాధారణ ప్రసవానికి అవకాశం ఉన్నా.. డోపిడీయే పరమావధిగా సిజేరియన్లు యథేచ్ఛగా చేసేస్తున్నారు. గర్భిణి క్లిష్ట పరిస్థితుల్లో ఉంటే శస్త్ర చికిత్స తప్పుకాదు. కానీ ఇది సాకుగా చూపి పైసలే పరమావధిగా శస్త్ర చికిత్సలనే ప్రోత్సహిస్తున్నారు. సిజేరియన్‌కు రూ.40 వేల నుంచి రూ.60 వరకు వసూలు చేస్తున్నారు. జిప్ పద్ధతి(కోత కనబడని శస్త్ర చికిత్స) పేరుతో అందిన కాడికి దోచుకుంటున్నారు. కాన్పుల కోసం ప్రైవేటు ఆస్పత్రుతలకు వెళ్లే వారిలో 80 శాతం మందికి శస్త్ర చికిత్సలే చేస్తుండటం ఆందోళన కలిగించే అంశం. ఇలాంటి దయనీయ దుస్థితిలో మార్పు తీసుకువచ్చేందుకు వైద్య శాఖ సన్నద్ధం అవుతోంది. అవసరం లేని సిజేరియన్ల వల్ల కలిగే అనర్థాలు, సహ ప్రసవాలతో జరిగే మేలును గర్భిణులకు వివరించేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తోంది. సహజ ప్రసవాలు పోత్రహించేందుకు 'సీ–సేఫ్' విధానాన్ని రూపకల్పన చేసి అమలుకు శ్రీకారం సన్నద్ధమవుతోంది.

ఇదీ సంగతి

జిల్లా వ్యాప్తంగా ప్రసూతి సేవలు అందించే ప్రైవేటు ఆస్పత్రులు సుమారు 300కి పైగా ఉన్నాయి. ప్రభుత్వ పరంగా రాజమహేంద్రవరం జీజీహెచ్, గోపాలపురం, నిడదవోలు, కొవ్వూరు, కడియం పీహెచ్‌సీల్లో ప్రసవాలు జరుగుతున్నాయి. జిల్లా వైద్య శాఖ గణాంకాల ప్రకారం 50 శాతం వరకు సిజేరియన్లు జరుగుతున్నాయి. వీటిలో 80 శాతం శస్త్రచికిత్సలు ప్రైవేటు ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయి. డబ్ల్యూహెచ్‌ఓ మార్గదర్శకాల ప్రకారం శస్త్రచికిత్సలు 10–15 శాతం లోపే ఉండాలి. ప్రైవేటు ఆస్పత్రుల్లో అయితే 50 శాతానికి పైగా అపరేషన్లు జరుగుతున్నాయి. అవసరం లేకపోయినా డబ్బులు దండుకునేందుకు సిజేరియన్లు చేస్తుండటంతో బాలింతలకు ఆరోగ్య పరమైన సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వీటిని అరికట్టాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం.

జిల్లాలో ఇలా..

జిల్లా వ్యాప్తంగా ఏప్రిల్ 22 నుంచి మార్చి 22 వరకు అధికారిక గణాంకాలు పరిశీలిస్తే ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో 22,648 ప్రసవాలు జరిగాయి. అందులో ప్రైవేటులో అత్యధికంగా 15,804, అందులో 10,433 సిజేరియన్లు జరిగాయి. 5,370 సాధారణ ప్రసవాలు మాత్రమే జరిగాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 6,844 జరగ్గా.. కేవలం 3,552 శస్త్ర చికిత్సలు మాత్రమే చేశారు. అదీ హైరిస్క్ కేసులు మాత్రమే ఉంటున్నాయి. 3,763 సాధారణ ప్రసవాలు జరిగాయి.

నర్సులకు శిక్షణ

సహజ ప్రసవాలు పెంచే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వాస్పత్రుల్లోని నర్సులకు నర్స్ ప్రాక్టీషనర్ ఇన్ మిడ్ వైఫరీ(ఎన్‌పీఎం) కోర్సులో శిక్షణ అందించారు. బ్యాచ్‌కు 30 మంది చొప్పున శిక్షణ ఇచ్చారు. గర్భధారణ జరిగినప్పటి నుంచి మహిళలకు అవసరమైన వైద్యం ఎలా అందజేయాలో వివరించారు. హైరిస్క్‌లో ఉన్న గర్భిణులను గుర్తించడం, వారికి అందించాల్సిన వైద్యం తదితర అంశాలపై శిక్షణ ఇస్తారు. శిక్షణ అనంతరం వీరికి నర్సింగ్ బోర్డులో పరీక్ష నిర్వహించారు. ఉత్తీర్ణులైన వారికి రాష్ట్ర వ్యాప్తంగా అత్యధికంగా ప్రసవాలు జరిగే 10 ఆస్పత్రుల్లో నియమించనున్నారు.

సీ–సేఫ్ అంటే..

అత్యవసరమైన సందర్భాల్లో మాత్రమే సిజేరియనుల చేయాలన్నదే 'సీ–సేఫ్' ఉద్దేశం. దీనిపై వైద్యులకు నిర్దిష్టమైన మార్గదర్శకాలు జారీ చేస్తారు. సిజేరియన్ విధానాలతో మాతృశిశు మరణాలు రాకుండా చర్యలు తీసుకుంటారు. ఆపరేషన్ చేసే సమయంలో అత్యంత సురక్షిత పద్ధతులు పాటించాలని సూచిస్తారు. ఈ విధానానికి యునిసెఫ్ సైతం సహకారం అందిస్తుంది.

సాధారణ కాన్పులే మేలు

నవమాసాలు మోస్తున్న గర్భిణులు ప్రసవ సమయంలో శస్త్రచికిత్సలను ప్రోత్సహించడం తగదని వైద్యులు అభిప్రాయ పడుతున్నారు. నార్మల్ డెలివరీ జరిగిన మహిళలు ఆరోగ్యంగా ఉంటారు. కాన్పు జరిగిన రెండో రోజు నుంచే పనులు చేసుకుంటారు. పుట్టిన బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటుంది. శస్త్ర చికిత్స ద్వారా బిడ్డకు జన్మనిస్తే మహిళ శారీరక పరిస్థితిని బట్టి రెండు వారాల వరకు విశ్రాంతి అవసరం. ప్రసవ సమయంలో 9 మాసాలు పూర్తయినా కొందరు మహిళలకు నొప్పులు రావు. ఇలాంటి సందర్భంలోనూ శస్త్ర చికిత్స చేసుకుంటున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న వైద్యులు సిజేరియన్‌ను ప్రోత్సహిస్తున్నారు. వైద్యుల్లో సైతం వేచి చూసే ధోరణి ఉండాలి. రోగుల ఒత్తిడి మేరకు శస్త్ర చికిత్సలను ప్రోత్సహించడం తగదు. గర్భం దాల్చినప్పటి నుంచి తేలికపాటి వ్యాయామాలు చేస్తే కాన్పు సమయంలో ఇబ్బందులు పడాల్సి అవసరం ఉండదని సూచిస్తున్నారు.



గౌరీపట్నం పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

జిల్లాలో మూడు నెలలుగా శస్త్ర చికిత్సలు, నార్మల్ డెలివరీలు ఇలా..

ఆస్పత్రి	నెల	సిజేరియన్లు	నార్మల్ డెలివరీ
ప్రభుత్వ	జనవరి	236	251
	ఫిబ్రవరి	253	250
	మార్చి	215	244
ప్రైవేటు	జనవరి	916	389
	ఫిబ్రవరి	631	345
	మార్చి	599	292



ఇన్నీసుపేట పీహెచ్‌సీలో అవగాహన

గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నాం



మహిళల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. మాతృ మరణాల కట్టడికి అనేక చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం అవసరం లేకుండా చేపట్టే జిసేరియన్లు నియంత్రించడంపై దృష్టి సారిస్తున్నాం. ఇందుకు గాను ప్రతి పీహెచ్‌సీ, గ్రామాల్లో గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నా.ం ఈ క్రమంలో సీ–సేఫ్ ప్రణాళిక రచించాం. ప్రైవేటు ఆస్పత్రుల్లోనే సిజేరియన్లను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నాం...

– డాక్టర్.కె. వెంకటేశ్వరరావు,జిల్లా వైద్య శాఖాధికారి

వారంలోనే అర్జీలకు పరిష్కారం

- దేవరపల్లిలో 96 అర్జీల స్వీకరణ
- జిల్లా కలెక్టర్ కె. మాధవీలత

దేవరపల్లి: ప్రజా సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించేలా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ కె. మాధవీలత పేర్కొన్నారు. దేవరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీల స్వీకరించారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్, అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి రాలేని ప్రజల సమస్యలను స్థానికంగా పరిష్కరించే దిశగా మండల స్థాయిలో ప్రతి బుధ, శుక్రవారాల్లో జగనన్నకు చెబుదాం.. స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయి సమస్యలు క్షేత్రాస్థాయిలోనే పరిష్కారం అయ్యేలా మండల స్థాయి అధికారులు నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. స్పందన కార్యక్రమంలో ఎక్కువగా భూ సమస్యలు, ఇంటి పట్టా సమస్యలు, కరెంట్ మీటర్ల సమస్యలు, శానిటేషన్‌పై అర్జీలు వచ్చాయన్నారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పనిచేయాలనే లక్ష్యంతో జగనన్నకు చెబుదాం..1902 కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్టు తెలిపారు. గడపగడపకూ మన ప్రభుత్వం ద్వారా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కరించినట్టు పేర్కొన్నారు. ఇటువంటి వేదికల మీద రెవెన్యూ, భూసమస్యలు తక్షణం పరిష్కారమయ్యే అవకాశం ఉందన్నారు. అర్జీలను రానున్న ఏడు రోజుల్లో పరిష్కారం చేయడానికి కార్యాచరణ అమలు చేయాలని జాయింట్ కలెక్టర ఎస్. తేజ్‌భరత్ అధికారులకు సూచించారు. ఆర్డీఓ, తహసీల్దార్, గ్రామ స్థాయిలో వీఆర్వోలు ఆయా అర్జీల పరిష్కారానికి మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె. వెంకటేశ్వరరావు, సీపీఓ ఎ. ముఖలింగం, జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు, డీపీఓ జె. సత్యనారాయణ, డీఈఓ ఎస్. అబ్రహం, ఆర్డీఓ కె. వి. కృష్ణారావు, డ్వామా పీడీ పి. జగదాంబ, డీఎస్ఓ విజయభాస్కర్, స్థానిక సర్పంచ్ కడిమి వీరకుమారి, ఏఎంసీ ఛైర్మన్ గన్నమని జనార్ధన రావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత. చిత్రంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, జేసీ తేజ్‌భరత్

ఇస్రో ప్రయోగాలతో కీర్తి పతాకం రెపరెపలు

- విద్యార్థులతో నన్నయ వీసీ పద్మరాజు
- ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ప్రారంభం
- వేంకటేశ్వర ఆనం కళాకేంద్రం ఆవరణలో రాకెట్ల నమూనాల ప్రదర్శన

సీటీఆర్‌ఐ: విద్యార్థులు ప్రతి రంగంలోనూ నాయకులుగా ఎదగాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. స్థానిక వేంకటేశ్వర ఆనం కళాకేంద్రం ఆవరణలో శుక్రవారం ఇస్రో ఆధ్వర్యంలో ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం వరకూ ఇవి జరుగుతాయి. ఈ సందర్భంగా వీసీ పద్మరాజు మాట్లాడుతూ ఇస్రో ప్రయోగాలతో భారత కీర్తి పతాకం రెపరెపలాడుతోందన్నారు. చంద్రయాన్ విజయవంతం కావడంతో ప్రపంచమంతా మనదేశం వైపు చూస్తోందన్నారు. అనంతరం ఇస్రో రూపొందించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్, ప్రైవేట్ కాలేజెస్ అసోసియేషన్, ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్, ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాకెట్ల నమూనాల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు.

అవగాహన అవసరం

అంతరిక్ష విజ్ఞానంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ సూచించారు. రోజుకు పదివేల మంది విద్యార్థులు సందర్శించేలా ప్రణాళిక వేసినట్లు తెలిపారు. శ్రీహరికోట ఎస్‌డీఎస్‌సీ డిప్యూటీ డైరెక్టర్ టీఎస్ రఘురామ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో అంతరిక్ష పర్యాటకం రాబోతోందని, అందుకు అనుగుణంగా ఇస్రో పరిశోధనలు, ప్రయోగాలు సాగిస్తోందన్నారు. షార్ ఎల్ఎస్ఎస్ఎఫ్ జనరల్ మేనేజర్ ఎస్.విజయకుమార్ మాట్లాడుతూ రాజమహేంద్రవరంతో పాటు విశాఖపట్నం, కర్నూలు, శ్రీహరికోటల్లో అంతరిక్ష వారోత్సవాలు చేస్తున్నామన్నారు. గురువారం నిర్వహించిన స్పేస్ వాక్‌కు మంచి స్పందన లభించిందని, సుమారు 3,500 మంది విద్యార్థులు పాల్గొనడం ఒక రికార్డు అన్నారు. కాగా.. ఉత్సవాల్లో భాగంగా తొలుత ప్యూచర్ కిడ్స్ విద్యార్థులు నమో భారతావని, వేదంలా ఘోషించే గోదావరి నృత్య ప్రదర్శనలు అలరించాయి. ట్రిప్స్ తదితర స్కూళ్ల విద్యార్థులు తయారు చేసిన నమూనాలు ఉంచారు. రాజ్యలక్ష్మి మహిళా కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు, పీఈటీలు సేవలందిస్తున్నారు. పలు స్కూళ్ల విద్యార్థులు తరలివచ్చి ప్రదర్శనను తిలకిస్తున్నారు. కార్యక్రమంలో రాజమహేంద్రి మహిళా కళాశాల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి, ఇస్రో శాస్త్రవేత్తలు, సిబ్బంది, ఉప విద్యాశాఖాధికారి నారాయణ, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ అధినేత బాలా త్రిపుర సుందరి, అక్షర శ్రీ స్కూల్ డైరెక్టర్ టి.నాగరత్నం, ప్రైవేటు స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ నాయకులు భాస్కర రామయ్య, పురెడ్ల కల్యాణ్ రెడ్డి, ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షుడు మండెల శ్రీరామ్మూర్తి, అధ్యక్షుడు కె.పార్థసారథి పాల్గొన్నారు.



చంద్రయాన్ నమూనాను పరిశీలిస్తున్న నన్నయ వీసీ ఆచార్య పద్మరాజు, కమిషనర్ దినేష్ కుమార్ తదితరులు

స్వామివార్ల భూములు స్వాహా

- వెతుకులాటలో దేవదాయశాఖ
- జగనన్న సమగ్ర భూ సర్వేతో అనుసంధానం
- లెక్క తేల్చే పనిలో యంత్రాంగం
- మండల దేవదాయ అధికారుల నియామకం

సాక్షిప్రతినిధి, కాకినాడ : అన్యాక్రాంతమైన దేవదాయశాఖ భూముల కోసం వేట మొదలైంది. చిన్నా, పెద్దా అనే తారతమ్యం లేకుండా అన్ని ఆలయాల్లో రెక్కలు వచ్చిన భూములకు లెక్కలు కట్టి ఆలయాలకు అప్పగించే పని వేగంగా జరుగుతోంది. ఆక్రమణలకు గురైన, అన్యాక్రాంతమైన భూముల లెక్కలు తవ్వి తీస్తున్నారు. ఇందుకోసం దేవదాయశాఖపై పట్టు ఉన్న సీనియర్‌లను ఎంపిక చేశారు. వారి నుంచి ప్రతి మండలానికి ఒక దేవదాయ అధికారిని నియమించారు. వారికి రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న సమగ్ర భూ సర్వే బృందాలను సమన్వయం చేసుకునేలా బాధ్యతలు అప్పగించారు. మండల దేవదాయ అధికారులు ఆయా మండలాల పరిధిలో ఉన్న ఆలయాలకు చెందిన భూములు రికార్డుల ప్రకారం ఎంత ఉన్నాయి, ఎక్కడెక్కడ ఉన్నాయి అనే వివరాలను రెవెన్యూ బృందాలకు అందజేస్తున్నారు. సర్వే నంబర్ ఆధారంగా భూములు ఏయే ప్రాంతాల్లో ఉన్నాయో లెక్క తేలుస్తున్నారు. ఎకరాలకు ఎకరాలున్నా కొన్ని ఆలయాలు ధూపదీప నైవేద్యాలకు సైతం నోచుకోని పరిస్థితులున్నాయి. ఆస్తులున్నా అన్యాక్రాంతమైన భూములను ఆక్రమణల చెర నుంచి విడిపించేందుకు జగనన్న సమగ్ర భూ సర్వే దోహదపడుతోంది. స్వాతంత్ర్యం వచ్చాక చరిత్రలో దేవదాయ భూములు రికార్డుల ప్రకారం లెక్క తేల్చడం, ఆక్రమణల్లో ఉన్న వాటిని వెలుగులోకి తేవడం ఇదే తొలిసారి కావడం విశేషంగా చెప్పుకుంటున్నారు.



కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం

తూర్పులో పలు ఆక్రమణలు

తూర్పుగోదావరి జిల్లా కేంద్ర రాజమహేంద్రవరం సహా పలు మండలాల్లోని ఆలయాల భూముల లెక్కలు నిగ్గు తేలాల్సి ఉంది. రాజమహేంద్రవరంలోని కోటిలింగాలక్షేత్రం, ఉమారామలింగేశ్వరస్వామి, హితకారిణి సమాజం భూములపై సమగ్ర సర్వే జరుపుతున్నారు. ఈ ఆలయాలకు సంబంధించిన భూములు కడియం, నిడదవోలు, రాజానగరం, తుని తదితర ప్రాంతాల్లో ఆక్రమణల్లో ఉన్నట్టు గుర్తించారు. జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూములకు కూడా రెక్కలు వచ్చాయి. ధూపదీప నైవేద్యాల కోసం వివిధ ప్రాంతాల్లో ఉన్న దాతలు ఇచ్చిన 1,620 ఎకరాలలో ప్రస్తుతం 13 ఎకరాలు మాత్రమే మిగిలి ఉంది. మిగిలిన భూమి పలు రకాలుగా ఆక్రమణలకు గురైంది. వీటిలో శాశ్వత భవనాలు నిర్మించేశారు. సమగ్ర భూ సర్వేలో ఈ భూముల వివరాలు బయటపడాల్సి ఉంది.

- దేవాలయాలు, సత్రాలు : 923
- మొత్తం భూమి : 15,900 ఎకరాలు
- ఆక్రమణలో ఉన్న భూమి : 905 ఎకరాలు

జగనన్న సమగ్ర భూ సర్వేతో తేలుతున్న లెక్కలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆక్రమణల్లో ఉన్న దేవదాయ భూముల లెక్క తేల్చడంలో అటు దేవదాయశాఖ, ఇటు రెవెన్యూ యంత్రాంగం బిజీగా ఉంది. సమగ్ర భూ సర్వేలో ఇప్పటికే ప్రాథమిక సమాచారం కొంతవరకు దేవదాయశాఖ చేతికొచ్చింది. ఆ భూములు ఏయే ప్రాంతాల్లో ఉన్నాయి అనేది నిర్దిష్టంగా తేల్చేందుకు కుస్తీ పడుతున్నారు. సమగ్ర భూ సర్వేతో దేవదాయ భూములు ఆక్రమణ చెర వీడుతున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మండలాల వారీగా ఆలయాలు, వాటి ఆధీనంలో ఉండాల్సిన భూముల జాబితా సిద్ధమవుతోంది. కాకినాడ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రాలకు చెందిన భూములు అన్యాక్రాంతానికి గురయ్యాయి. కొన్ని ఆలయాలకు సంబంధించి భూములు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియని అయోమయ పరిస్థితులు ఉన్నాయి. గత పాలకులు భక్తుల డిమాండ్‌లను పెడచెవిన పెడుతూ వచ్చారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సమగ్ర భూ సర్వే నిర్వహిస్తుండటంతో స్వాతంత్ర్యానంతరం తొలిసారి భూముల లెక్కలు తేలుతున్నాయి. దేవాదాయ భూములకు కూడా మోక్షం కలిగే అవకాశం ఈ సర్వే ద్వారా దక్కుతోంది.

భూములను నిషేధిత జాబితాలో పెడుతున్నాం



జగనన్న శాశ్వత భూ సర్వే ద్వారా దేవదాయశాఖ పరిధిలోని ఆలయాలు, సత్రాలు, మఠాలకు చెందిన భూమి వెలుగులోకి వస్తోంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆ భూములు దేవదాయశాఖకు చెందినదిగా ఉండడంతో వాటిని నిషేధిత జాబితాలో చేరుస్తున్నాం. ఇటీవల ప్రభుత్వం కొత్తగా ఇచ్చిన ఆర్డినెన్స్ ప్రకారం దేవదాయశాఖకు చెందిన భూములు ఎవరివద్దనైనా ఉంటే స్వాధీనం చేసుకునేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆలయాలు, మఠాలు, సత్రాలకు ఎంతో ఉపయోగం. ప్రభుత్వం ఇచ్చిన ఆర్డినెన్స్‌తో దేవదాయశాఖ భూములకు మరింత రక్షణ వచ్చింది.

– మేడేపల్లి విజయరాజు, దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్

ప్రభుత్వ నిర్ణయం సరైనదే



ఎన్నో ఏళ్లుగా దేవదాయశాఖకు చెందిన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్ల ఆయా భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. ప్రస్తుతం ప్రభుత్వం చేస్తోన్న జగనన్న భూసర్వేలో దేవదాయశాఖకు చెందిన, ఆక్రమించిన భూములు బయటపడుతున్నాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఆయా ఆలయాలు, సత్రాల భూములకు రక్షణ కల్పించినట్లయ్యింది.

– మామిళ్లపల్లి అయ్యప్ప శర్మ,
అర్చక పురోహిత సంఘం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఇక ముత్యాల రత్నగిరీశుడు!

- ఆశ్వీయుజ పౌర్ణిమ నాడు అలంకరణ
- ప్రతి సోమవారం 'ముత్తంగి'లో దర్శనమివ్వనున్న సత్యదేవుడు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుడు, దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి, శివలింగాకారంలోని ఈశ్వరుడు అతి త్వరలో ముత్యాల వస్త్రాల్లో (ముత్తంగి ధరించి) దర్శనమివ్వనున్నారు. ప్రాచీన కళ అయిన ముత్తంగిని స్వామి, అమ్మవారు, శంకరులకు తయారు చేయించాలని దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ సంకల్పించగా తయారీకి అయ్యే ఖర్చు రూ.11 లక్షలు భరించేందుకు దేవస్థానం వ్రత పురోహిత సంఘం అంగీకరించిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌కు చెందిన ముత్తంగి కళాకారుడు సుధీర్ చరణ్ కుటుంబ సభ్యులు నెల రోజులుగా ఈ ముత్యాల వస్త్రాల తయారీలో నిమగ్నమై ఉన్నారు. అత్యంత నియమ నిష్ఠలతో ఈ పనిని చేస్తున్నారు. దసరా నాటికి ఈ ముత్యాల వస్త్రాలను స్వామివారికి అందజేయాలని వారు భావిస్తున్నారు. సత్యదేవుడు, అమ్మవారు, శంకరులకు ముత్తంగి తయారీ అవకాశం మా అదృష్టంగా భావిస్తున్నామని వ్రత పురోహిత సంఘ నేత నాగాభట్ల రవి శర్మ తెలిపారు.

ముత్తంగి తయారీ ప్రాచీన కళ

ముత్యాలతో దేవతామూర్తులకు ముత్తంగి తయారు చేయడం ప్రాచీనమైన కళ. హైదరాబాద్‌లోని సుధీర్ చరణ్ కుటుంబం కొన్ని తరాలుగా (వందేళ్లకు పైగా) ఈ కళను కాపాడుకుంటూ వస్తోంది. తమిళనాడులోని శ్రీరంగంలో సుమారు 12 అడుగుల పొడవునా పవళించి ఉండే శ్రీరంగనాథునికి 17వ శతాబ్దంలో నాయకర్ రాజులు 'ముత్తంగి' తయారు చేయించినట్టు చరిత్ర. వందేళ్ల తరువాత అది కొంత వన్నె తగ్గడంతో 1932లో చెన్నయ్‌కు చెందిన మా ముత్తాత కృష్ణాజీ ముత్యాలు, వజ్రాలు, కెంపులతో ముత్తంగిని మళ్లీ తయారు చేసి రంగనాథుడికి అలంకరించారని సుధీర్ చరణ్ తెలిపారు. ఏటా ముక్కోటి ఏకాదశి నుంచి పది రోజుల పాటు ముత్తంగి అలంకరణలో రంగనాథుడు దర్శనమిస్తున్నారని తెలిపారు. తిరుమలలో మలయప్పస్వామివారికి, భద్రాచలంలో శ్రీసీతారాములకు కూడా తమ కుటుంబమే ఈ ముత్తంగి తయారు చేసిందని తెలిపారు.



ముత్తంగి తయారీలో చరణ్ కుటుంబ సభ్యులు

ముత్తంగి తయారీలో నిమగ్నం

ముత్తంగి వస్త్రాల తయారీ చాలా శ్రమ, నేర్పరితనంతో కూడిన కళ. ఇందుకు అవసరమయ్యే ముత్యాలుకు అయ్యే వ్యయం తక్కువే అయినా నెలల తరబడి వాటిని వస్త్రంగా తయారు చేయడం పెద్ద పని. శిరస్సు దగ్గర నుంచి పాదాల వేళ్ల వరకు దేవతా మూర్తుల కొలతలు తీసుకుని ముందుగా వెండి లేదా రాగి రేకుతో వస్త్రంలా తయారు చేసి దానికి వివిధ సైజులలో ముత్యాలను అతికిస్తారు. ముత్యానికి ముత్యానికి మధ్యలో ఎటువంటి గ్యాప్ ఉండదు. కేవలం స్వామి, అమ్మవారి ముఖం మాత్రమే కనిపిస్తుంది. సత్యదేవుడి ముత్తంగి తయారీలో సుధీర్ చరణ్‌తో బాటు ఆయన భార్య ప్రియాంక, తల్లి రేఖ, కుమార్తె హృదయ, చిన్నమ్మలు పనిచేస్తున్నారు.



సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్ల ఉత్సవమూర్తులు

ఆశ్వీయుజ పౌర్ణిమ నాడు ప్రత్యేక పూజలు



ఆశ్వీయుజ పౌర్ణిమ నాడు సత్యదేవుడు, అమ్మవారు, శంకరులను ఈ ముత్తంగి వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేయించాలని నిర్ణయించాం. ప్రతీ సోమవారం భక్తులకు ముత్తంగి అలంకరణలోనే స్వామి, అమ్మవారు దర్శనమిస్తారు. ఈ ముత్తంగి తయారీ గురించి దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ కు తెలియచేయగానే ఆయన కూడా అంగీకరించారు.

– ఈఓ. చంద్రశేఖర్ అజాద్



తయారవుతున్న స్వామివారి అభయహస్తం

బంగారు కోటింగ్ వేసిన రాగి రేకుపై..



బంగారు కోటింగ్ వేసిన రాగి రేకుపై మంచి ముత్యాలు, అక్కడక్కడా పచ్చలు అతుకుతున్నాం. ముత్తంగి వస్త్రంలోనే స్వామివారికి హారం ఉంటుంది. ఈ హారంలో నవరత్నాలు పొదుగుతున్నాం. పది మంది కుటుంబ సభ్యులం రోజుకు 16 గంటలు కష్టపడి వీటిని తయారు చేస్తున్నాం. దసరాకు వీటిని అప్పగించాలని ప్రయత్నిస్తున్నాం. వీటిని భద్రపరిచేందుకు రెండు పెట్టెలు టేకు చెక్కతో తయారు చేస్తున్నాం. ఒక పెట్టెలో సత్యదేవుడు, అమ్మవారి ముత్తంగిలు, ఇంకో పెట్టెలో శంకరుని ముత్తంగి, సత్యదేవుని శిరస్సు మీద ఉండే ముత్తంగి గొడుగు, ఇతర ముత్తంగులు భద్రపరచవచ్చు.

– సుధీర్ చరణ్

క్లుప్తంగా

త్వరలో సత్యదేవుని నూతన నివేదన శాల ప్రారంభం



నివేదన శాలను పరిశీలిస్తున్న ఈవో, దాత తదితరులు

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో తునికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త చెక్కా తాతబాబు రూ.21 లక్షల వ్యయంతో నిర్మించిన స్వామివారి నివేదన శాలను త్వరలో ప్రారంభించనున్నట్టు ఈవో చంద్రశేఖర్ ఆజాద్ తెలిపారు. శుక్రవారం ఆయన దాతతో కలిసి నివేదన శాలను పరిశీలించారు. దాత మాట్లాడుతూ దేవస్థానంలో ఏ వైదిక కార్యక్రమం మొదలు పెట్టినా తొలి అవకాశం తనకే దక్కడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. గతంలో దేవస్థానంలో చాలా కార్యక్రమాలు తన చేతుల మీదుగా ప్రారంభించినట్టు తెలిపారు. స్వామివారి నివేదనశాల నిర్మించే అదృష్టం కూడా తనకు దక్కినందుకు దేవస్థానం చైర్మన్, ఈవోలకు కృతజ్ఞతలు తెలిపారు. ఏఈవో డీవీఎస్ కృష్ణారావు, వ్రత పురోహితుల సంఘం నాయకులు నాగాభట్ల రవిశర్మ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు గొల్లవిల్లి విద్యార్థిని



చిలకమర్తి రమ్యలక్ష్మీ దుర్గ

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న చిలకమర్తి రమ్యలక్ష్మీ దుర్గ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్టు పీడీ గొలకోటి ఫణీంద్ర శుక్రవారం తెలిపారు. ఇటీవల అనపర్తిలో జరిగిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 17 వాలీబాల్ పోటీలలో రమ్య తన సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు కడప జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటుందని పీడీ ఫణి తెలిపారు. పీఎంసీ చైర్మన్ దోనిపాటి రమావెంకట రమణ, హెచ్‌ఎం లంకా రాణి, పీడీ డి.సరస్వతి, పీఈటీ విజయభాస్కర్ రమ్యను అభినందించారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

సామర్లకోట: మండల పరిధిలో ఉండూరు గ్రామంలో ఈ నెల 2వ తేదీన జరిగిన కొత్తెం సుబ్రహ్మణ్యం (35) హత్యకు సంబంధించి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచినట్టు సీఐ కె.దుర్గాప్రసాద్ శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఉండూరు శివారు ప్రకాశరావుపేటలోని ధర్మతేజ లే అవుట్‌లో సుబ్రహ్మణ్యం హత్య జరిగిన విషయం విదితమే. మృతుడి తల్లి కొత్తెం సావిత్రి ఫిర్యాదు మేరకు పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. మద్యం సేవించిన సమయంలో మృతుడితో పాటు మరో వ్యక్తితో ఘర్షణ జరిగిందనే స్థానికుల సమాచారం మేరకు అదే గ్రామానికి చెందిన చిట్టుమూరి సత్తిబాబుపై నిఘా ఉంచారు. ఈ మేరకు నిందితుడి సత్తిబాబును గురువారం అరెస్టు చేసి శుక్రవారం స్పెషల్ మొబైల్ కోర్టులో హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు సీఐ తెలిపారు.

ఆ వృద్ధురాలిని కడతేర్చింది కోడలే

- వివాహేతర సంబంధాలకు అడ్డొస్తోందని హత్య
- మిస్టరీని ఛేదించిన పోలీసులు
- నిందితుల అరెస్ట్

మధురపూడి: ఇంట్లో నిద్రిస్తున్న తల్లోజు పార్వతి (70)ని రాడ్‌తో బలంగా కొట్టి హత్యచేసిన నిందితులను కోరుకొండ పోలీసులు అరెస్టు చేశారు. తన వివాహేతర సంబంధాలకు అడ్డొస్తోందన్న కారణంతో కోడలు తల్లోజు గంగా శ్రీలక్ష్మి, కూతురు సహాయంతో ఈ హత్య చేసింది. ఈ ఘాతుకం కోరుకొండ మండలం కణుపూరులో ఈ నెల 4వ తేదీన జరిగింది. నిందితులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. కోరుకొండ పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ డాక్టర్ ఎం.కిషోర్‌కుమార్ వివరాలు వెల్లడించారు.

హత్య జరిగిన తీరిది...

మృతురాలు పార్వతి ఈ నెల 4వ తేదీ రాత్రి గ్రామంలోని తన మూడవ కుమారుడైన వెంకటేశ్వర్లు ఇంటి వద్ద భోజనం చేసి, టీవీలో సీరియల్ చూసి, స్వంతింటికొచ్చి పడుకుంది. అదే ఇంట్లో నాలుగవ కుమారుడు తల్లోజు వీరబాబు, అతని భార్య గంగా శ్రీలక్ష్మి, మనుమరాలు, మనుమడు నివాసం ఉంటున్నారు. పార్వతి భర్త సుబ్బారావు చనిపోవడంతో అన్నీ తానై పిల్లల్ని పెంచి ప్రయోజకులను చేసింది. ఆమెకు ఐదుగురు ఆడపిల్లలు, నలుగురు మగపిల్లలున్నారు. అందరికీ పెళ్లిళ్లు చేసింది. తన వద్ద గల భూమిని అందరికీ సమానంగా పంచింది. భర్త కట్టించిన ఇల్లు కావడంతో నాలుగవ కుమారుడు వీరబాబుతో పాటు ఉంటోంది. కాగా వివాహేతర సంబంధాలకు అడ్డొస్తోందన్న ఉద్దేశంతో అత్తను లేకుండా చేయాలని కొంతకాలంగా కోడలు శ్రీలక్ష్మి ఎదురుచూస్తోంది. మైనర్ బాలికయిన తన కుమార్తెతో కలిసి, పథకం ప్రకారం రాత్రి వేళ హత్య చేసింది. అర్ధ రాత్రి నిద్రిస్తుండగా ముందే సిద్ధం చేసుకున్న ఇనుపరాడ్‌తో పార్వతి తలపై బలంగా కొట్టింది. దీంతో నిద్రలో ఉన్న పార్వతి రక్తపు మడుగులో మృతి చెందినట్టు డీఎస్పీ కిషోర్‌కుమార్ తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లి శ్రీలక్ష్మి మొబైల్ ఫోన్‌ను పరిశీలించిన పోలీసులు పలు విషయాలను గుర్తించారు. హత్య చేస్తే, డాగ్ స్క్వాడ్, క్లూజ్ టీమ్‌లు ఎలా వెతుకుతాయి. నేరం చేసిన వ్యక్తులను పోలీసులు ఎలా ఇంటరాగేట్ చేస్తారు. తప్పించుకోవడం ఎలా అనే వీడియోలను యూ ట్యూబ్ ద్వారా చూసినట్టు గుర్తించారు. రక్తపు మడుగులో ఉన్న అత్త మృతదేహం ఇంట్లో ఉండగా, నిందితురాలు ఇంట్లో వంట చేసుకోవడంతో అనుమానించారు. విచారణలో నిందితురాలు హత్యచేసినట్టు అంగీకరించింది. తన వివాహేతర సంబంధాలకు అడ్డుగా ఉందని హత్య చేసినట్టు తెలిపింది. ఆమెతో పాటు, హత్యలో పాల్గొన్న మృతురాలి మనుమరాలు (మైనర్ బాలిక) కూడా తప్పులు చేస్తోందని నానమ్మ మందలించడాన్ని తట్టుకోలేక హత్యచేసినట్టు అంగీకరించిందని డీఎస్పీ కిషోర్ కుమార్ తెలిపారు. శ్రీలక్ష్మిని హత్యానేరం కింద అరెస్టు చేసి, కోర్టులో హాజరుపర్చనున్నట్టు, మైనర్ బాలికను బాలనేరస్తుల శిబిరానికి పంపనున్నట్టు తెలిపారు. కోరుకొండ సీఐ జి.ఉమామహేశ్వరరావు, ఎస్సై కట్టా శారదా సతీష్ పాల్గొన్నారు.



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ డాక్టర్ కిషోర్‌కుమార్

అత్తింటివారి వేధింపులతో వివాహిత ఆత్మహత్య

జగ్గంపేట: కట్నం కోసం అత్త, భర్త వేధించడంతో మండలంలోని మామిడాడ గ్రామానికి చెందిన వివాహిత మనస్తాపంతో గురువారం రాత్రి ఉరిపోసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. జగ్గంపేట ఎస్సై నాగార్జునరాజు శుక్రవారం అందించిన వివరాలు ఇలా వున్నాయి. మామిడాడ గ్రామానికి చెందిన కనిపే రాజేష్‌కు అదే గ్రామానికి చెందిన పూసల సంధ్యారాణితో 2016లో వివాహం జరిగింది. వీరికి గత ఏడాది ఒక అమ్మాయి పుట్టింది. అయితే.. వీరు 2016కు ముందు నుంచి ప్రేమించుకోవడం, పెళ్లి విషయం వచ్చేసరికి రాజేష్ ముఖం చాటేయడం, అనంతరం సంధ్యారాణి ఎలుకలు మందు తాగి అప్పట్లో ఆత్మహత్యాయత్నం చేసుకోవడం లాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. దీంతో కుల పెద్దలు కలగచేసుకుని వీరి మధ్య రాజీ కుదిర్చి 2016లో వివాహం చేశారు. అయితే అప్పటి నుంచి కూడా రాజేష్ అతని దత్తత తల్లి చిన్నోడు కలిసి, సంధ్యారాణిని కట్నం కోసం వేధిస్తూ వచ్చారు. ఈ నెల 5వ తేదీ రాత్రి రాజేష్ అతని భార్య సంధ్యారాణికి మధ్య మళ్లీ గొడవలు జరిగాయి. భర్త రాజేష్ అతని దత్తత తల్లి చిన్నోడు కట్నంకోసం మళ్లీ వేధించడంతో మనస్తాపం చెందిన సంధ్యారాణి ఇంట్లో ఉరిపోసుకుని ఆత్మహత్యాప్రయత్నం చేసింది. ఈ సంగతి గమనించిన భర్త రాజేష్ ఆమెను స్థానికుల సహాయంతో కిందకు దింపి ప్రత్తిపాడులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే మార్గం మధ్యలోనే ఆమె ప్రాణాలు విడిచినట్లు ఎస్సై నాగార్జునరాజు వివరించారు. దీనిపై మృతురాలి తల్లి పూసల నాగమణి శుక్రువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్యపై దాడి చేసిన వ్యక్తికి ఏడాది జైలు

కాకినాడ లీగల్: భార్యపై దాడి చేసిన భర్తకు ఏడాది జైలు, రూ.1,000 జరిమానా విధిస్తూ కాకినాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ వి.లీలాశ్యామ్ సుందరి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం..పెదపూడి మండలం జి.మామిడాడ గ్రామానికి చెందిన టేకుమూడి లక్ష్మితో టేకుమూడి రాజుకు 18 ఏళ్ల క్రితం వివాహం అయింది. వివాహమైన కొంతకాలం నుంచి రాజు మద్యానికి అలవాటు పడి తరచు భార్యను వేధించేవాడు. 2017 నవంబర్ 26వ తేదీన రాజు మద్యం మత్తులో భార్యను కర్రతో కొట్టడంతో లక్ష్మి కుటుంబ సభ్యులు అడ్డు వచ్చారు. వారిపై కూడా రాజు కర్రతో దాడి చేశారు. దీనిపై భార్య లక్ష్మి పెదపూడి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో భర్త రాజుపై నేరం రుజువు కావడంతో ఏడాది జైలు, రూ.1,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఏపీపీ కె.సుధరాణి ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

విద్యుత్ షాక్‌కు వ్యక్తి మృతి

ముమ్మిడివరం: మండలంలోని గేదెల్లంకలో శుక్రవారం విద్యుత్ షాక్‌కు గురై ఒక వ్యక్తి మృతి చెందాడు. ఆ గ్రామానికి చెందిన బొక్కా సత్యనారాయణ(53) శుక్రవారం ఉదయం వాటర్ హీటర్‌ను బకెట్‌లో నుంచి తీస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. సత్యనారాయణ వ్యవసాయకూలీ, గతంలో అతని భార్య లక్ష్మి మృతి చెందింది. కుమార్తె వెంకట నాగ దుర్గాభవానీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై జాన్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఆర్చరీ పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులు

రాజోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా కాకినాడలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆర్చరీ పోటీల్లో చింతలపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు దొంగ జానకిరామయ్య ఆర్చరీ పోటీల్లో ప్రతిభ చూపిన కొంబత్తుల లక్కీబాబు, సోముల రాజేష్‌ను అభినందించారు. సర్పంచ్ మట్టా ప్రసన్నకుమారి, పీఎంసీ చైర్మన్ నల్లి నాగబాబు, మండల ఉపాధ్యక్షుడు ఇంటిపల్లి ఆనందరాజు, వ్యాయామ ఉపాధ్యాయుడు చొప్పల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రేపు పిఠాపురంలో ఆర్చరీ పోటీలు

పిఠాపురం: స్థానిక ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తూర్పు గోదావరి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జేఎస్ఎస్ గోపాలకృష్ణ, లక్ష్మణరావు శుక్రవారం తెలిపారు. పురుషులు, మహిళల విభాగాల్లో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్‌కార్డు, జనన ధ్రువపత్రం తీసుకురావాలని సూచించారు. ఇండియన్ రౌండ్, రికర్వ్ కాంపౌండ్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వారై ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 99890 01162 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

వెదజల్లులో కలుపు నివారణ తప్పనిసరి

జాతీయ వరి పరిశోధన శాస్త్రవేత్త శ్రీదేవి

ఆలమూరు: వరి రైతులు తమ పంట పొలాల్లో వెదజల్లు విధానాన్ని అవలంబిస్తున్న సమయంలో కలుపు మందుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం ద్వారా చక్కని ఫలితాలు సాధించవచ్చునని హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో నున్న జాతీయ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్ బి.శ్రీదేవి వ్యాఖ్యానించారు. మండలంలోని పెనికేరులో వెదజల్లు పద్ధతిలో సాగుచేసిన వరి పంట పొలాల్లో వ్యాపిస్తున్న కలుపు రకాలను ఆమె ప్రత్యేకంగా పరిశీలించి రైతులతో సమావేశం అయ్యారు. కలుపు నివారణకు సంబంధించి శాస్త్రవేత్తలు సూచించిన నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వెదజట్లు పద్ధతిలో వరి సాగు వల్ల రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ఈ విధానంలో సాగు చేసేటప్పుడు కలుపు అధికంగా ఏర్పడుతుందని, రెండు మూడు ఆకులతో ప్రాథమిక దశలో ఉన్నప్పుడే కలుపు నివారణ మందులను నిర్ణీత సమయంలో పిచికారీ చేయాలన్నారు. మొక్కలు ఎదిగాక కలుపు నివారణ మందులు పిచికారీ చేయడం వల్ల ప్రధాన పంట సైతం దెబ్బ తినే అవకాశం ఉందని హెచ్చరించారు. వరిసాగు ప్రోత్సాహానికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఈ ఏడాది సుమారు 2.5 లక్షల ఎకరాల్లో వరిసాగు చేపట్టగా అందులో 67 శాతం వెదజల్లు విధానాన్నే రైతులు ఎన్నుకున్నారని ఏరువాక శాస్త్రవేత్త ప్రదీప్ తెలిపారు.

అధునాతన వంగడాల అభివృద్ధి

తెగుళ్లు తట్టుకోవడంతో పాటు త్వరితగతిన కోత దశకు చేరుకునే రకాలను అభివృద్ధి చేస్తున్నట్లు వరి పరిశోధన శాస్త్రవేత్త శ్రీనివాసు తెలిపారు. డీపీఆర్ ధాన్ 48,49, 53 రకాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆ రకాల్లో జింక్, ఐరన్ పోషకాలు పుష్కలంగా ఉంటాయన్నారు. కామన్ వెరైటీగా ప్రసిద్ధిగాంచిన ఈధాన్ రకం వరి పంట 125 రోజుల్లోనే చేతికొస్తుందన్నారు. కార్యక్రమంలో పెద్దాపురం ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ హెచ్‌వీ నరసింహారావు, మంతెన రమేష్ రాజు, గన్ని విష్ణు, కోన శ్రీనివాసు, ఆలమూరు ఏవో సోమిరెడ్డి లక్ష్మీ లావణ్య పాల్గొన్నారు.



పెనికేరులో పంటను పరిశీలిస్తున్న జాతీయ వరి పరిశోధన శాస్త్రవేత్త శ్రీదేవి

ఉపాధ్యాయుడి విచారణ

పిఠాపురం: పట్టణంలో ఏడో తరగతి విద్యార్థిని పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఒక ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడిని శుక్రవారం అధికారులు విచారణ నిర్వహించారు. తమ కుమార్తె పట్ల ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించినట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ, కాకినాడ డీఎస్పీ మురళీధరరెడ్డి, పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ విచారణ నిర్వహించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారులు తెలిపారు. కాగా గురువారం స్కూలు వద్ద ఆందోళన నిర్వహించిన బాలిక బంధువులు శుక్రవారం కూడా ఆందోళన నిర్వహించారు. ప్రిన్సిపాల్, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

కోడిపందేలపై పోలీసుల దాడి

పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడలో శుక్రవారం కోడి పందేలు ఆడుతున్న వారిపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు గొల్లప్రోలు ఎస్సై వినయ్‌ప్రతాప్ తెలిపారు. దుర్గాడలో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో వెళ్లి దాడి చేయగా కోడి పందేలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.800, రెండు కోళ్లు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

వరల్డ్ కప్ టెన్నికాయిట్ పోటీల్లో మెరిసిన హేమమాధురి



డబుల్స్ విభాగంలో కాంస్య పతకాలు సాధించిన హేమమాధురి, మౌనిక

ఏలూరు రూరల్: సౌతాఫ్రికాలో జరిగిన టెన్నికాయిట్ వరల్డ్ కప్ పోటీల్లో పశ్చిమగోదావరి క్రీడాకారిణి జి.హేమమాధురి కాంస్య పతకం సాధించిందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ కార్యదర్శి సంపంగి తిరుమలరావు ఓ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 8 వరకు సౌతాఫ్రికాలో 5వ టెన్నికాయిట్ వరల్డ్ కప్ పోటీలు జరుగుతున్నాయని, శుక్రవారం జరిగిన జూనియర్ డబుల్స్ విభాగంలో విశాఖపట్టణం క్రీడాకారిణి ఆర్.మౌనికతో కలిసి హేమమాధురి తృతీయస్థానంలో నిలిచిందని వివరించారు. పశ్చిమగోదావరి జిల్లా దేవరపల్లికి చెందిన ఈ క్రీడాకారిణి పలుసార్లు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి బాలికల్లో స్ఫూర్తి నింపిందని పేర్కొన్నారు. విజేతలను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రెసిడెంట్ యు.రాంప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.రవీంద్ర అభినందించారు.

బాలుడిని తల్లి వద్దకు చేర్చిన పోలీసులు



బాలుడిని తల్లికి అప్పగిస్తున్న ధవళేశ్వరం పోలీసులు

ధవళేశ్వరం: ఇంట్లో గొడవ పడి బయటకు వచ్చి తిరుగుతున్న బాలుడిని ధవళేశ్వరం పోలీసులు గుర్తించి తల్లి వద్దకు చేర్చారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. బొమ్మూరు గ్రామం సుద్దగనికి చెందిన మేడబోయిన కృష్ణవేణి కుమారుడు పదకొండేళ్ల చైతన్య శుక్రవారం తల్లితో గొడవపడి స్కూల్‌కు వచ్చేశాడు. అనంతరం ఇంటికి వెళ్లకుండా రాజవోలులో తిరుగుతుండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. బాలుడిని ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి వివరాలు అడగ్గా సరిగా సమాధానం చెప్పలేకపోయాడు. దీంతో బాబు వివరాలతో పోలీసులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. రెండు గంటల అనంతరం వలంటీర్ల సాయంతో పోలీసులు బాబు ఆచూకీ కనుగొని తల్లికి అప్పజెప్పారు. బాలుడిని క్షేమంగా తల్లి వద్దకు చేర్చిన ధవళేశ్వరం సీఐ కె.మంగాదేవి, సిబ్బందిని ఎస్పీ టి.జగదీష్ అభినందించారు. బిడ్డను తన వద్దకు చేర్చినందుకు తల్లి.. జిల్లా ఎస్పీ టి.జదగీష్, ధవళేశ్వరం పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

అంతర్జాతీయ టెన్నిస్‌లో రెండు పతకాల సాధన

రాజమహేంద్రవరం సిటీ: గ్రీస్‌లో జరిగిన అంతర్జాతీయ టెన్నిస్ క్రీడా పోటీల్లో తన కుమారుడు పిల్లా శివాజీ రెండు పతకాలు సాధించి ఈ నెల 9న నగరానికి రానున్నారని రాజమండ్రి కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు, క్రీడాకారుని తండ్రి పిల్లా బాల తెలిపారు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాల మాట్లాడుతూ వీటి కాలేజీలో ఇంటర్ మీడియట్ రెండో సంవత్సరం చదువుతున్న శివాజీ గ్రీస్‌లో గత నెల 23నుంచి 29 వరకూ జరిగిన వరల్డ్ డెఫ్ టెన్నిస్ చాంపియన్ షిప్‌లో పోటీలలో సీనియర్స్ విభాగంలో సింగిల్స్ లో కాంస్య, డబుల్స్‌లో రజత పతకం సాధించాడన్నారు. 42 దేశాల క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో సింగిల్స్ విభాగంలో మూడవ స్థానం సాధించాడని, రాజస్థాన్ క్రీడాకారునితో కల్సి ఆడిన డబుల్స్‌లో రెండవ స్థానం లభించిందని చెప్పారు. 9న మధురపూడి విమానాశ్రయం నుంచి ఊరేగింపుగా దానవాయిపేటలోని ఇంటికి తీసుకొస్తామని తెలిపారు. అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రామాజీ, మల్లికార్జునరావు పాల్గొన్నారు.